## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



ఎగ్జిబిషన్ మైదానంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి డిస్ట్రిక్ట్ గవర్నర్ కమల్ కిశోర్ అగర్వాల్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమల్ కిశోర్ మాట్లాడుతూ..నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 76 రోజులుగా అన్నదానం చేస్తున్నామని, అదే విధంగా కోఠి మెటర్నటీ దవాఖానలో ప్రతి నిత్యం ఉదయం అల్పాహారం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి సూర్య శుక్ల పాల్గొన్నారు.

**- అబిడ్స్, అక్టోబర్ 13**

## బ్యూటీ ఉత్పత్తులపై ఆసక్తి





నేటి సమాజంలో మహిళలు బ్యూటీ ఉత్పత్తులపై ఆసక్తి కనబరుస్తున్నారని మిస్ ఏషియా సుధాజైన్ అన్నారు. శుక్రవారం బేగంబజార్ ఫీల్‌ఖానలో నిర్వహించిన కృష్ణ బ్యూటీ సెంటర్ పదో వార్షికోత్సవంలో సుధాజైన్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. మహిళల అలంకరణ ఉత్పత్తులు, కేశాలంకరణ, ముఖంపై మొటిమలు తొలగిపోయేందుకు గాను స్కిన్ బ్యూటీ ఉత్పత్తుల రంగంలో కృష్ణ బ్యూటీ సెంటర్ ముందు వరుసలో నిలువడం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో హోల్ సేల్ ధరలకే విక్రయిస్తున్న కృష్ణ బ్యూటీ సెంటర్‌ను అభినందించారు. మనీష్ సోలంకి, వంశీ కృష్ణ, లక్ష్మి, సంధ్య మాట్లాడుతూ.. పదేండ్లుగా హెయిర్ పిన్ నుంచి లేజర్ థెరపీ వరకు బ్యూటీ అకాడమీలకు హోల్‌సేల్ ధరలకు అందించడం గర్వంగా ఉందన్నారు. కృష్ణ బ్యూటీ అకాడమీలకు చెందిన వారిని సన్మానించారు.

**- సుల్తాన్‌బజార్, అక్టోబర్ 13**

## యువతలో దేశభక్తిని పెంపొందించాలి



యువతలో దేశ భక్తిని పెంపొందిచాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డా.నరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నాభూమి నాదేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నే 300మంది వలంటీర్లు 9 కళాశాలలో పంచ్‌ప్రాన్ ప్రతిజ్ఞ తీసుకుని విశ్వవిద్యాలయం, కళాశాలలోని వివిధ ప్రాంతాల్లో పవిత్ర మట్టిని సేకరించి, దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్మిస్తున్న అమృత్ వాటికన్ నిర్మాణంకు పంపిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ద్వారా నిర్వహిస్తున్నట్లు డీఎస్‌ఎ డా.జెల్లా సత్యనారాయణ తెలిపారు.

**- వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 13**

# కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ..

**నిఘా ముమ్మరం చేసిన అధికారులు**

**మద్యం, డబ్బు రవాణా, పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు**

అబిడ్స్, అక్టోబర్ 13 : ఎన్నికల షెడ్యూల్డ్ విడుదల కావడంతో గోషామహల్ నియోజకవర్గంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ అధికారులతో సమీక్ష జరుపుతూ నిఘాను ముమ్మరం చేయిస్తున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరుగకుండా ఉండేందుకు గాను ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం ఏర్పాటుతో పాటు గోషామహల్ ఏసీపీ కె.వెంకటరెడ్డిని నోడల్ అధికారిగా నియమించిన విషయం విదితమే. ఈ బృందాలు ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహిస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బు రవాణా, పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా నియోజకవర్గం స్టాటిక్ సర్వేలెన్స్ బృందం నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. ఉల్లంఘనలు జరుగకుండా చూస్తున్నామని రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విషయంలో ఫిర్యాదులు ఉన్నా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.



జీహెచ్ఎంసీ భవనం, అబిడ్స్

### ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు..

నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నాయి. ఎక్కడ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తించినా ఈ బృందంలోని అధికారులు వెంటనే అక్కడకి వెళ్లి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారు. ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగినా వెంటనే సంబంధిత పరిధిలోని బృందాలకు సమాచారం అందుతుంది. సమాచారం అందిన వెంటనే బృందాలు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందిస్తారు.

### స్టాటిక్ సర్వేలెన్స్ టీం..

స్టాటిక్ సర్వేలెన్స్ టీం నియోజకవర్గం పరిధిలో ప్రతి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు ముమ్మరం అవుతున్నాయి. వీరితో పాటు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న గోషామహల్ ఏసీపీ కె.వెంకటరెడ్డి నేతృత్వంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు జరుగకుండా వీడియో సర్వేలెన్స్ టీంలు నిఘా ఏర్పాటు చేస్తున్నాయి.

### నియమాలు పాటించాలి



ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్‌ను పాటించాలి. డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవు. కుల, మత, ప్రాంతాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించరాదు. ప్రార్థనా మందిరాలను ఉపయోగించరాదు, సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలి. మంచి వాతావరణంలో ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టేందుకు రాజకీయ నాయకులు ముందుకు రావాలి.

**- వి.విక్టర్, గోషామహల్ రిటర్నింగ్ అధికారి**

# గుడ్డు ఆరోగ్యానికి ఎంతో మేలు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 13 : గుడ్డు ఆరోగ్యానికి ఎంతో మేలని, కరోనా అనంతరం తెలంగాణలో కూడా వినియోగం పెరిగిందని రాజేంద్రనగర్ పీవీ నర్సింహా రావు వెటర్నరీ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డా.ఏకాంబరం తెలిపారు. శుక్రవారం వర్సిటీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన, ప్రపంచ గుడ్డు దినాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు.. పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి, శరీరానికి కావాల్సిన కొవ్వు, వృద్ధాప్య ఛాయలు నిరోధించడానికి గుడ్డు ఉపయోగపడుతోందని తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరం భారత్‌లో 12,960 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యాయని తెలిపారు. దక్షిణ భారత్ నుంచే ఎక్కువ ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కరోనా అనంతరం మన ప్రాంతంలో కూడా వినియోగం పెరిగిందని, మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోని మన వర్సిటీ నుంచే కాకుండా డైరెక్టరేట్ ఆఫ్ ఫౌల్ట్రీ నుంచి వారానికి 50 లక్షల కోడి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డా.మహేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బడులు, అంగన్‌వాడీ కేంద్రాలకు, గర్భిణులకు గుడ్డు అందించడం హర్షణీయమన్నారు. పతి రోజు కోడి గుడ్డును ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డా.రఘునందన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇతర యూనివర్సిటీ అధికారులు, ఎస్.రవీందర్ రెడ్డి, డా.మాధురి, డా.ఎస్. సాయిరెడ్డి, శ్రీలత, ఆర్.పురుషోత్తం, ఎస్.రవీందర్ రెడ్డి, ఇతర కళాశాల ఆచార్యులు పాల్గొని పలు సూచనలు చేశారు. పశువైద్యశాల క్యాంపస్‌లో బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని జరుపుకొన్నారు.




మాట్లాడుతున్న వెటర్నరీ డీఆర్ డా.ఏకాంబరం



దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని జీవన్‌జ్యోతి సంఘంలో కొలువైన శ్రీజయదుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,ఆలయ కమిటీ చైర్మన్ కొరుడు భూమేశ్వర్ తెలిపారు. **- సైదాబాద్, అక్టోబర్ 13**

# జూకల్ - పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో రైల్వే బ్రిడ్జి మంజూరు

- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 13: జూకల్- పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం మంజూరు కావడంతో శుక్రవారం రైల్వే అధికారులు స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. జూకల్-పెద్దషాపూర్ గ్రామాల మధ్య రైల్వేగేటుతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతులు వచ్చిన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి రాయలసీమ, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు వెళ్లడం కోసం రైలు ఇక్కడి నుంచి రాకపోకలు జరుగుతుంటాయని వివరించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయడం కోసం బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతి వచ్చిందన్నారు. నిధులు సైతం మంజూరు చేశారని వివరించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని తెలిపారు.

### ఏండ్ల నాటి సమస్య తీరనుంది..

ఏండ్ల నాటి నుంచి రైల్వే గేటుతో జూకల్ గ్రామం మీదగా రాకపోకలు నిర్వహించే ప్రజల ఏండ్లనాటి సమస్య తీరనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూకల్- పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న రైల్వే లైన్‌తో రైలు వచ్చినప్పుడు ప్రయాణికులు గంటల తరబడి నిలబడి అనేక ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధులు చేవెళ్ల ఎంపీ రంజీత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు రైల్వే అధికారులను పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వడంతో స్పందించిన రైల్వే అధికారులు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతి ఇవ్వడంతో పాటు నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేసిన చేవెళ్ల ఎంపీ రంజీత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కే.చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జూకల్ గ్రామ సర్పంచ్ కోడూరి నర్సమ్మ, ఉప సర్పంచ్‌లు మన్నేమల్లారెడ్డి, రాజు నాయక్, మాజీ సర్పంచ్ పోరెట్టి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్యనందం, పవన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, సిద్ధులు, కృష్ణ, లింగంగౌడ్, నరేశ్‌గౌడ్, దినేశ్‌గౌడ్, చాకలి భిక్షపతి, బి.శ్రీనివాస్ ఉన్నారు.



రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు, స్థానిక నాయకులు